క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం, ఎల్ఐసీ కార్యాలయం, అంబేడ్కర్ కూడలి, నక్కలగుట్ట మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలగోకులానికి దరఖాస్తులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని మాధవ స్మారక సమితి వివేకానంద యోగా కేంద్రంలో 8 రోజుల పాటు నిర్వహించనున్న బాలగోకులం వేసవి ఉచిత శిక్షణ శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు డాక్టర్ కోదాటి సుధాకర్ రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే 1నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక, మానసిక, శారీరక, బౌద్ధిక వ్యక్తిత్వ వికాసంపై అనుభవజ్ఞులైన విద్యా నిపుణులు, శిక్షకులతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 94407 20624 , 98496 85002 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత



కాజీపేట రూరల్: ఇంటి నుంచి తప్పిపోయి కాజీపేట రైల్వే స్టేషన్‌కు వచ్చిన సుమారు 7 ఏళ్ల బాలికను కాజీపేట జీఆర్పీ పోలీసులు చేరదీసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ ఎం.రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఒంగోలుకు చెందిన కావ్య ఇంటి నుంచి బయలుదేరి కాజీపేటకు వచ్చి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా కనిపించడంతో ఒక ప్రయాణికుడు గమనించి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు బాలిక వివరాలు సేకరించి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

కేయూ ఫైనాన్స్ అధికారికి సన్మానం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫైనాన్స్ అధికారిగా పనిచేస్తూ ఈనెలాఖరులో ఉద్యోగ విరమణ పొందబోతున్న తోట రాజయ్యను పరీక్షల విభాగంలో సోమవారం సన్మానించారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ ఆసిం ఇక్బాల్ కలిసి రాజయ్యకు బొకే, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ నర్సింహారావు, శ్రీలతాదేవి, సరళాదేవి, పర్యవేక్షకులు సురేష్, సునీల్‌కుమార్, ప్రతాప్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

హన్మకొండ: కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హౌసింగ్ బోర్డు కాలనీ అధ్యక్షుడు కొండా నాగరాజు అన్నారు. కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి గుంగుల వినోద, కోశాధికారి రవిని అంగన్‌వాడీ టీచర్ పి.సరస్వతి, తదితరులు సోమవారం సన్మానిచ్చారు. హెల్త్ సూపర్‌వైజర్ గోవర్ధన్. ఏఎన్ఎం సరోజ, హెల్పర్ స్వప్న, ఆశ వర్కర్లు విజయ, ఉమ, సంధ్య పాల్గొన్నారు.

కళాశాలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: హనుమకొండలోని భీమారం ప్రాంతంలో అనుమతి లేకుండా నడుస్తున్న ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల జేఈఈ, ఐఐటీ మెయిన్స్ పేర్లతో నడుస్తోందని, ఆ కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం డీఐఈఓ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు ప్రశాంత్, శ్రీకాంత్, ప్రభాకర్, రాజశేఖర్, నితిన్, ప్రమోద్, చక్రి పాల్గొన్నారు.

లెర్నింగ్ సెంటర్ పేరుతో ప్రచారం

విద్యారణ్యపురి: హనుమకొండ నగరంలో లెర్నింగ్ సెంటర్ పేరుతో ప్రచారం నిర్వహిస్తూ అనుమతి లేకుండా ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఏఐఎఫ్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున్ అన్నారు. ఆ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని డీఐఈఓ గోపాల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గరల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, బాధ్యులు పాలబోయిన రాజు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సీతంపేటలో 'ఇళ్ల' లొల్లిపై విచారణ

- రెండు జాబితాలు రద్దు
- కొత్త జాబితా తయారు
- నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపిక
- ఇళ్ల లొల్లిపై ఎమ్మెల్యే ఆగ్రహం?



విచారణ జరుపుతున్న ఎంపీడీఓ కర్ణాకర్‌రెడ్డి

హసన్‌పర్తి: సీతంపేటలో ఇళ్ల లొల్లిపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. తనకు తెలియకుండానే తన సంతకాన్ని ఫోర్జరీ చేసి జాబితాను అధికారులకు సమర్పించారని ఇందిరమ్మ కమిటీ సభ్యుడు.. హనుమకొండ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి కర్ణాకర్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 20 ఇళ్లతో రూపొందించిన తొలి జాబితా, ఆ తర్వాత 24 మందితో కూడిన రెండో జాబితాను రద్దు చేస్తున్నట్లు మండల అధికారి ప్రకటించారు.

కొత్త జాబితా తయారు

రెండు జాబితాలను రద్దు చేసి కొత్త జాబితాను రూపొందించారు. 24 మందితో తయారు చేసిన ఈ జాబితాలో 16 మంది వితంతువులు, నలుగురు దివ్యాంగులతో పాటు మరో నలుగురు ఇతర వర్గాలకు చెందిన వారిని చేర్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికపై ఎమ్మెల్యే ఆగ్రహం?

సీతంపేటలో ఇళ్ల లొల్లిపై ఎమ్మెల్యే నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. స్థానిక శాసనసభ్యుడు కేఆర్.నాగరాజును కొంతమంది ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి విషయాన్ని వివరించడానికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే మాత్రం ఆ విషయాన్ని వినకుండా సున్నితంగా దాటవేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక పాదర్శకంగా చేపట్టాలని స్థానికులు కోరారు. ఈమేరకు ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.

'ఆపరేషన్ కగార్'ను ఆపేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖిలా వరంగల్: ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్ట ప్రాంతంలో కేంద్ర పోలీస్ బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు పడమర కోట అమర వీరుల స్తూపం వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదలు నేటి ఆపరేషన్ కగార్ వరకు అనేక మంది అమాయక ఆదివాసీ ప్రజలు కేంద్ర బలగాల చేతిలో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖనిజ సహజ సంపదను బడా కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలకు అప్పగించేందుకే ఈ నరమేధాన్ని కేంద్రం కొనసాగిస్తోందని ఆరోపించారు. గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, సుద్దాల వీరన్న, ఇనుముల కృష్ణ, అక్బర్, బండి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- గ్రీవెన్స్‌కు 136 వినతులు



దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న సంధ్యారాణి

వరంగల్: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌లో డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, పీడీ హౌసింగ్ గణపతిలతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 136 దరఖాస్తులు రాగా రెవెన్యూశాఖ 48, గృహ నిర్మాణ శాఖ (హౌసింగ్) 43, ఇతర శాఖలకు 45 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సొంత జిల్లాలో సీట్లు కేటాయించాలి

రాష్ట్ర వ్యాప్తంగా 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులకు సొంత జిల్లాల్లోనే సీట్లు కేటాయించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్‌లు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు.

భూమిని కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలి

సర్వేనంబర్ 158/16లో 22 గుంటల భూమి ఉంది. ఈ భూమిని స్థానికంగా ఉన్న సౌరం రాజు, దామెర ఏలియాలు కబ్జా చేసి ప్లాటింగ్ చేసి అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కబ్జా చేసిన స్థలంలో నిర్మించిన ఇంటికి ఇంటినంబర్ ఇవ్వకుండా చర్య తీసుకోవాలి.

– దామెర సమ్మయ్య, ఏనుమాముల

యువతకు స్ఫూర్తి.. సాయిశివాని



వరంగల్: ఆల్ ఇండియా 11 ర్యాంక్ సాధించిన సాయిశివాని.. తెలంగాణకే కీర్తి కిరిటీమని, ఆమె జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ అన్నారు. సప్తధామంలో శివానికి ట్రస్ట్ తరపున యంగ్ టాలెంట్ అవార్డును సోమవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాయిశివాని మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం , శ్రద్ధతో ఏదైనా సాధ్యమని అన్నారు. తన విజయానికి భగవద్గీత కూడా దోహదపడిందని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య, ఉమాశంకర్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఈవీ.శ్రీనివాసరావు, అనిత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణే లక్ష్యం

వరంగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో బాల్య వివాహాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు షేర్ స్వచ్ఛంద సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లాల కోఆర్డినేటర్ తోట శిరీష తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ కోసం మత పెద్దలతో కలిసి అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు గుర్తుచేశారు. 2030వ సంవత్సరం నాటికి దేశం నుంచి బాల్య వివాహాలను నివారించాలనే లక్ష్యంతో జేఆర్సీ 'బాల్య వివాహ రహిత భారత ప్రచారా'న్ని నిర్వహిస్తుండటం గమనార్హం కోఆర్డినేటర్ అన్నారు.

పొంగులేటిని కలిసిన మేయర్

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం(ఆర్ఓఆర్) 2025పై హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని హెలిపాడ్ వద్ద నగర మేయర్ గుండు సుధారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

ప్రయాణంలో అప్రమత్తత అవసరం



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది

- ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్

ఖిలా వరంగల్: రైలులో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ సూచించారు. దేశవ్యాప్తంగా చేపట్టిన భద్రతా చర్యల్లో భాగంగా సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ ఆదేశాల మేరకు వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫారాలు, రైల్వే స్టేషన్ ఆవరణలో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైలు ప్రయాణంలో అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించినా, వస్తువులు కనిపించినా వెంటనే ఆర్పీఎఫ్ కంట్రోల్ నంబర్ 139కు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికులు తమ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న వెంకట్

విద్యారణ్యపురి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ కోరారు. హనుమకొండలోని హంటర్‌రోడ్డులోని అవోపా భవన్‌లో టీఎస్‌యూటీఎఫ్ ఉద్యమ తరగతులకు ముఖ్యఅతిథిగా ఆయన సోమవారం హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐదు డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. కాశ్మీర్‌లోని పహల్గాం నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, పెండెం రాజు, సుజన్ ప్రసాద్ రావు, బాధ్యులు వెంకటరెడ్డి, అన్నాదేవి, రాజారాం , రవూఫ్, లింగారావు, కరుణాకర్, చంద్రయ్య, మోజెస్, శ్రీనివాస్, రమేష్, సదానందం, రవీందర్, నామోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ టీ20 క్రికెట్ పోటీ విజేత తెలంగాణ



తెలంగాణ జట్టుతో ఎమ్మెల్సీ సారయ్య, నిర్వాహకులు

రామన్నపేట: తెలంగాణ వీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ20 (డే అండ్ నైట్) క్రికెట్ పోటీల్లో తెలంగాణ జట్టు విజేతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. కేఎంసీ మైదానంలో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్స్‌లో గోవా జట్టుతో తెలంగాణ జట్టు తలపడి విజేతగా నిలిచినట్లు వివరించారు. ఈమేరకు తెలంగాణ జట్టు కెప్టెన్ జాన్ అరుణ్‌కు ట్రోఫీని ఎమ్మెల్సీ బస్వరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ శ్రీకాంత్, శివ, 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష్‌శ్రీమాన్, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జన్ను రవి, జన్ను వివేక్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

వరంగల్: ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా వరంగల్ ఏనుమాముల మార్కెట్‌ను బంద్ చేయాలని మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డిని ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు కోరారు. ఈమేరకు మార్కెట్ కార్యాలయంలో సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా దయాకర్, గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, సుంచు జగదీశ్వర్ మాట్లాడుతూ ఎంతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి, వాటి అమలు కోసం ప్రయత్నం చేస్తోందన్నారు.

ఖిలా వరంగల్: వచ్చేనెలలో జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో కందిక చెన్నకేశవులు అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా సమావేశం సోమవారం జరిగింది.

పహల్గాం నరమేధం అత్యంత దారుణం



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

హన్మకొండ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం నరమేధం అత్యంత దారుణమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహ రెడ్డి, రాష్ట్ర సహ అధ్యక్షుడు జి.వీరస్వామి అన్నారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటకులను హత్య చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈనెల 29న సాయంత్రం హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెలిశోజు రామ మనోహర్, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తుమ్మ వీరయ్య, సభ్యులు మదార్ సాహెబ్, మహేందర్, కె.రమేష్, ఎన్.కిష్టయ్య, ఆగయ్య, శ్యాంసుందర్ రెడ్డి, జి.సత్యనారాయణ, సత్తయ్య, సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జీపీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: జీఓ నంబర్ 510ని రద్దు చేసి గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ప్రతీ కార్మికుడికి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈమేరకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని హనుమకొండ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) లక్ష్మీ రమాకాంత్‌కు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సూచించారు. జీపీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఒకటో పీఆర్‌సీలో నిర్ణయించిన ప్రకారం రూ.26 వేల వేతనం చెల్లించాలని, విధి నిర్వహణలో మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ఓదెలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్ రవీంద్ర నాయక్‌కు కృతజ్ఞతలు



డీహెచ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బాధ్యులు

ఎంజీఎం: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్‌ను తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా గుర్తించడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్‌బాబు, కోశాధికారి యాదయ్య, గౌరవ అధ్యక్షులు వేణు గోపాల్‌రెడ్డి, పరబ్ కుమార్, మహేష్, అడ్వైజర్ ముత్తార్ మొహినొద్దీన్, అహ్మదుల్లా ఖాన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ ప్రసాద్, ఖలీల్ హుస్సేన్, శ్రీధర్ రెడ్డి, అలీ, జాయింట్ సెక్రటరీలు చంద్రయ్య, దుర్గం అఖిల్, శ్రీశైలం, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వంగ సుధాకర్ రెడ్డి, వరంగల్ జిల్లా సెక్రటరీ అవినాష్, రాజేందర్, అరుణ జ్యోతి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జాతీయ సంస్థలతో పోటీపడాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల జాతీయస్థాయి సంస్థలతో పోటీపడాలని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆ కళాశాలకు ప్రభుత్వ యూనివర్సిటీ ఫార్మసీ కేటగిరీలో హైదరాబాద్ మీడియా హౌస్ ఆధ్వర్యంలోఓ ఎలక్ట్రానిక్ మీడియా వారు ఈనెల 26న టెక్నికల్ ఎడ్యుకేటర్ అవార్డు 2025 అందజేసిన నేపథ్యంలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో డీన్ సమ్మయ్య, అధ్యాపకుల బృందం వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వీసీ వారిని అభినందించారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి

మడికొండ: మడికొండలోని డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాలు అందజేశారు. స్థానికంగా వాయు కాలుష్యం, నీటి కాలుష్యం గణాంకాలతో కూడిన నివేదికను జతపర్చారు. త్వరలోనే డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు మద్దెల ఎర్రగట్టు స్వామి, తొటిరెడ్డి కరుణాకర్ రెడ్డి, బొల్లికొండ రాజుగౌడ్, సాంబరాజు, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కబ్జాకు యత్నాలు

వరంగల్: వరంగల్ మండల పరిధి లక్ష్మీపురం గ్రామం ఎల్బీనగర్‌లోని సర్వే నంబర్ 7/199లో మున్సిపల్ సఫాయి ల్యాండ్ (డంపింగ్ యార్డు)గా రికార్డుల్లో ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు చదును చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని సోషల్ మీడియాలో ప్రచారం అయింది. దాంతో బీజేపీ నాయకులు స్పందించి ఆ స్థలాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడుతూ 1965 నుంచి రెవెన్యూ రికార్డుల్లో సఫాయి ల్యాండ్‌గా ఉన్న ఆ స్థలంతో పాటు నగరం నడిబొడ్డులో ఉన్న పలు ప్రభుత్వ విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోమాకుల నాగరాజు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూదాని గోవింద్ సింగ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఖిలా వరంగల్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచించారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో రఫి, బూత్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, మోర్చా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బండ్‌పైకి అనుమతించాలని వాకర్ల ధర్నా



హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి బండ్‌పై వాకింగ్‌కు అనుమతించాలని సోమవారం హంటర్ రోడ్డులో బండ్ వద్ద వాకర్లు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. సోమవారం ఉదయం వాకర్స్ పెద్ద ఎత్తున బండ్ వద్దకు చేరుకున్నారు. బండ్‌పైకి రాకుండా సిబ్బంది ప్రధాన గేటుకు తాళాలు వేశారు. దీంతో వాకర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి నిరసన చేపట్టారు. అధికారులు అనుమతిస్తే గేట్లు తెరుస్తామని సెక్యూరిటీ చెప్పడంతో రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. దీంతో ఖమ్మం జాతీయ రహదారిపై ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కిలోమీటర్ దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈవిషయం తెలిసి పోలీసులు వారి వద్దకు వచ్చి నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌ల రద్దుకు పోరాటం చేయాలి

వరంగల్: కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా చేసే లక్ష్యంతో ఆర్ఎస్ఎస్, బీజేపీ సర్కార్ తెచ్చే లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు పోరాడాలని 139వ మే డే సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ గుర్తుచేశారు. మేడేను జరుపుకోవాలని కార్మిక వర్గానికి పిలుపునిస్తూ కాశిబుగ్గ అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు ఎలుకంటి రాజేందర్, ఎండీ.ఖాన్, వెంకట్‌స్వామి, రాజేందర్, రమేష్, రంజిత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సంబురం

కాజీపేట: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రజతోత్సవం విజయవంతం అయిందని బీఆర్ఎస్ నాయకులు కాజీపేట చౌరస్తాలో సోమవారం సంబురాలు చేసుకున్నారు. ప్రధాన రహదారిపై బాణసంచా కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నార్లగిరి రమేష్, పి.శివకుమార్, తండమల్ల వేణు, మర్యాల కృష్ణ, నయీం జుబేర్, కనకరాజ్, కోండ్ర శంకర్, బి.వినయ్ కుమార్, నరేష్, సుబ్బు పాల్గొన్నారు.

నేటి పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయాలి

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈనెల 29న జరగనున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం, ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మంగళవారం ధర్నా జరుగుతుందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లకు కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం అందడం లేదని, 5 డీఏలు పెండింగులో ఉన్నాయని, పీఆర్ఎస్ జాడే లేదని తెలిపారు.

డీఈఓ జ్ఞానేశ్వర్‌ను తొలగించాలి

వరంగల్: అర్హతలేని, అసమర్థత ఇన్‌చార్జ్ డీఈఓ జ్ఞానేశ్వర్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్(టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రీవెన్స్‌సెల్‌లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ డీఈఓగా బాధ్యతలు నిర్వర్తించాలంటే కనీస అర్హత బీఈడీ ఉండాలని, అయితే, ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న జ్ఞానేశ్వర్‌కు కేవలం బీకాం డిగ్రీ మాత్రమే ఉందని పేర్కొన్నారు. టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల వంశీకృష్ణ, తోట రమేష్, వెంకట్ నాయక్, మణితేజ, ప్రసాద్ పాల్గొన్నారు.

4న భద్రకాళి అమ్మవారి మహోత్సవం

హన్మకొండ చౌరస్తా: వచ్చే నెల 4వ తేదీన విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న భద్రకాళి బ్రహ్మోత్సవాలకు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘీయులు హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల బాధ్యులు పిలుపునిచ్చారు. ఈమేరకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాలను హనుమకొండ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆవిష్కరించారు. పెందోట చక్రపాణి, సంగోజు మోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ మాతృసంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి మాట్లాడుతూ 4న ఉదయం హవనాలు, అమ్మవారికి విశేష అభిషేక పూజలు, పల్లకీ సేవ, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం శేష వాహన సేవ నిర్వహించనున్నట్లు వివరించారు.

భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

హన్మకొండ: భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల పత్రికను బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు మున్నూరు కాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య అందజేశారు. ఈనెల 29నుంచి మే 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు తొలిరోజు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పెరుకారి శ్రీధర్, కోశాధికారి పూజారి సత్యనారాయణ, కార్యదర్శి మందాటి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.